**నమస్తే తెలంగాణ**

# కర్ణాటక గుణపాఠం

**అన్ని** విజయాలూ పోరాడి సాధించుకున్నవి కావు. కొన్నిసార్లు ఓడిపోయినవారు అప్పనంగా రాసిచ్చిన విజయాలూ ఉంటాయి. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం ఆ కోవలోనిదే. ఆ గెలుపులో కాంగ్రెస్ సత్తా కన్నా బీజేపీ బలహీనతలే ఎక్కువ. మతోన్మాద విధానాలు, అవినీతితో కుళ్లిపోయిన బీజేపీ పాలనను ప్రజలు తిరస్కరించారు. ఆ వ్యతిరేకతతోనే మరో ప్రత్యామ్నాయం లేక కాంగ్రెస్ చేతికి పగ్గాలిచ్చారు. అయితే వారి పరిస్థితి అంతటితో అయిపోతుందా? హడావుడిగా గుదిగుచ్చిన ఐదు గ్యారెంటీలను అమలుచేయాలంటే మాటలా? కేవలం ఆరు నెలల కాలంలోనే హామీలు అమలుచేయలేక, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం కాంగ్రెస్ మార్కు పరిపాలనకు నిదర్శనం. ఐదేండ్లు పరిపాలించాల్సిన పార్టీ పనితనం సగం ఏడాదిలోనే తేలిపోయింది.

అధికారానికి దూరమై అర్రులు చాస్తున్న కాంగ్రెస్ ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటక ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించింది. రకరకాల వర్గాలను రకరకాలుగా ఊరించింది. ఉచిత కరెంటు ఇస్తామనేది అందులో మొదటిది. పేద, ధనిక తేడా లేకుండా ఇండ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సరఫరా చేస్తామని చెప్పారు. దీనికి గృహజ్యోతి అని అందమైన పేరు కూడా పెట్టారు. కానీ ఈ జ్యోతి వెలగలేక మినుకు మినుకుమంటున్నది. అందరికీ కాదు కొందరికే అంటూ సవాలక్ష కొర్రీలు పెట్టారు. లబ్ధిదారుల సంఖ్య పరిమితం చేయడం ఆ కొర్రీల లక్ష్యమనేది పైకే తెలిసిపోతున్నది. మరోవైపు కోతలు, బిల్లుల మోతలతో చుక్కలు చూపిస్తున్నది. అన్నభాగ్య కింద ఉచిత బియ్యం సరఫరా చెయ్యలేక అరకొర నగదుతో సరిపెడుతున్నారు. యువనిధి కింద ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇంకా మొదలుకానే లేదు. గృహలక్ష్మి కింద మహిళలకు రూ.2,000 సాయంగా ఇస్తామన్నారు. కోట్ల మంది నమోదు చేసుకుంటే వందల సంఖ్యలో కూడా పంపిణీ జరగలేదు. శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని హామీ ఇచ్చారు. ఆర్టీసీకి నష్టాలు రావడంతో అమలు చేయలేక బ్రేకులు వేస్తున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో కర్ణాటక ఓటర్లను కాంగ్రెస్ బురిడీ కొట్టించిందని ఈ పథకాల ప్రహసనంతో తేలిపోయింది. బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకున్న కర్ణాటక ప్రజలు తమ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యిందని వాపోతున్నారు.

లెక్కాపత్రం లేకుండా ఇచ్చిన హామీలు ఓ వైపు ఈడిగిలబడుతుంటే అటు ప్రభుత్వ పెద్దలు పదవుల కొట్లాటలో తలమునకలై కాంగ్రెస్ కల్చర్ అంటే ఏమిటో చవిచూపిస్తున్నారు. నేను సీఎం అంటే నేను సీఎం అని ఒకరిని మించి మరొకరు రంకెలు వేస్తూ రాజకీయాన్ని అరాచకీయం చేస్తున్నారు. అవినీతి పుట్టల్లోంచి బుసలు కొడుతున్న నోట్ల కట్టలు స్కాంగ్రెస్ అనే మారుపేరును సార్థకం చేస్తున్నాయి. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోతే గోసపడుడేనని దేశ ప్రజలకు, తెలంగాణకు కర్ణాటక ఇస్తున్న తాజా సందేశం!



## సుభాషితం

బండ మాటల దిగజారుడులో, జారిపోతూ
ఏ వైభవాల అంతస్తుల్ని నిర్మించగలవు?

అనైతిక ముసుగులోంచి వచ్చి,
విసిరిన సవాల్‌తో నాయక ధీర కాలేవు

ఓర్చుకోలేని బలిదానాల హాహాకారాలకు
కన్నీరొడ్వని ముఖచిత్రం
నీ మొఖాన్ని రాజచిత్రంగా చెక్కగలదనే
మూర్ఖపు నమ్మికవు

చీకటి రోజుల చేతిలో పడి,
ఉషోదయాలకు దూరమైనవు

ప్రసంగాల అరుపులు,
తొడగొట్టు చప్పళ్ళతో
కామెడీల వంటకం భలే అదిరిస్తున్నవు

ఆత్మకొక కండువా చొప్పున
ఎన్ని వేషాలకు సిద్ధమవుతవు?
కుర్చీయే ఏకైక లక్ష్యమైతే
రాజకీయం సన్యసించాలె

మొట్టమొదట జనం గోసల్ని
రెట్టపై దట్టీ గట్టి, తడిమిన దాఖలాలేవీ?

చెరువులు పరవళ్ళు తొక్కినా
నీ వొంటికి సల్లంటక పోవడం
ఆశ్చర్యాల కెల్ల వింత

లొల్లులు లేని విశ్వనగరిలో
కల్లబొల్లి కబుర్ల విల్లంబులేమి దూస్తవు?

'జొన్న కొయ్యలా ప్రశ్న'నని సంబురపడుతుంటవు
నీ చిత్తశుద్ధికి, నిజాయితీకి కూడా నీవే ప్రశ్నవు


రేసులో, కిక్కిరిసిన నావలో ప్రయాణిస్తున్నవు
గెలుపూ, కల
విహారాన్ని ఆపి,
నిన్ను నేలపైకి దింపవు

అలలైతే జనసముద్రం పోటుకు
నువ్వూ, నీ నావా గల్లంతే
నీ అవాంఛిత కాంక్షా చెలిమి
తెలంగాణ సైసది!

**- సుబోధిక్**

## వీళ్లు మనకు అవసరమా?

బిల్లులను ఏండ్ల తరబడి క్లియర్ చేయనివారు, రాజకీయాలు చేసేవారు, సీఎంతో తెల్లవారుజామున ప్రమాణ స్వీకారం చేయించేవారు, విపక్షాల ప్రభుత్వాలను అస్థిరపరచాలని ప్రయత్నించేవాళ్లు, బహిరంగంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు విధేయత చూపుతున్నవారు, రాజ్యాంగ ఔచిత్యాన్ని ఉల్లంఘించేవాళ్లు.. వీళ్లంతా మనకు అవసరమా?



**- కపిల్ సిబల్,** రాజ్యసభ ఎంపీ, ప్రముఖ న్యాయవాది

# హాత్ కో హాత్ దో.. కార్ కో వోట్ దో!

చదువరులందరికీ శుభాకాంక్షలు. మన తెలంగాణ బాగున్నది. మనందరి కోరికలు నేరవేరుతున్నయి. అందరి కోరికలు అంటే అందరివీ! కులం, మతం, ప్రాంతం, వర్గం, వర్ణం, లింగ భేదాలు మాత్రమే కాకుండా... పార్టీ విభేదాలు కూడా లేకుండా ప్రజలను పచ్చగా ఉంచుతున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం. ఏ పార్టీ ఎమ్మెల్యే అనే తేడా లేదు. సంక్షేమ ఫలాల అందజేతలో ఎలాంటి తేడాలు చూపడం లేదు. నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తితో సంపద పంపిణీ జరుపుతున్నది కేసీఆర్ పాలన!



**శ్రీశైల్‌రెడ్డి పంజుగుల**
90309 97371



వికారాబాద్ జిల్లా తాండూరు రూరల్ మండలం ఎల్మకన్నె గ్రామ ప్రచారంలో ఈ వ్యాస రచయితకు ఎదురైన అనుభవం ఇది... కాంగ్రెస్ కండువా వేసుకుని వచ్చిన యువకుడు నినాదాలు, అరుపులతో అల్లరి చేస్తూండగా.. గత పదేండ్ల పాలనలో ఇంటింటికీ అందిన ప్రయోజనాలు లెక్కలతో సహా ఏకరువు పెడుతూ ఉంటే, మీ ఇంటికి ఏమన్నా ఒచ్చినయా అమ్మనడుగు అని చెప్తూ ఉంటే అప్రతిభుడైండు ఆ యువకుడు. మీ ఊరికీ, మీ ఇంటికీ ఏ ఒక్క పని, ఏ ఒక్క బుడ్డ పైసా రానట్టయితే నీ ఇష్టం ఉన్నవారికి ఓటు వేసుకో అంటుంటే అతనే కాదు, అక్కడ గుమిగూడిన వారంతా పిన్‌డ్రాప్ సైలెన్స్. మరొక ఉదాహరణ బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లి తండాను ఆనుకుని ఉన్నది కర్ణాటకలోని 'ఆడికి' తండా. ఒరానికి (గట్టు) ఇవతల తెలంగాణ భూమి, అవతల కర్ణాటక భూమి. మేము ప్రజలతో మాట్లాడుతూ ఉంటే, పక్క పొలంలోకి కర్ణాటక రైతులు వచ్చి విన్నరు. రైతుబంధు, 24 గంటల కరెంటు, రైతుబీమా గురించి చెప్తుంటే.. మా ఊరు తెలంగాణలో కలిపేయమని మీ కేసీఆర్ సారుకు చెప్పండి అంటూ వారి మొర!

> ఫ్రెండ్స్.. ఇలాంటి ఉదాహరణలు రాష్ట్రం నలుమూలలా ఎన్నో, ఎన్నెన్నో. సరిహద్దుల అవతల నుంచి కూడా మనను ప్రేమిస్తున్నరు. ఎంత గర్వ కారణం మనందరికీ. పదేండ్లలోనే ఇన్ని అద్భుతాలు సాధించుకున్నం మనం, కేసీఆర్ నేతృత్వంలో. ఇపుడవన్నీ తిరుగుమార్గం పట్టించాలని కంకణం కట్టుకుని ఉన్నవారు 'ప్రతిపక్షాల' రూపంలో మీ ముందుకువస్తున్నరు.

కులమూ, మతమూ పిచ్చి మెండుగా ఉన్న రేవంత్ రెడ్డి, ఆయనను ఆడించే చంద్రబాబు సహా తెలంగాణ మేలు కోరే వారి ముసుగులో ఉన్న వారందరూ కలిసి మిడుతల దండు వలె మీద పడుతున్నరు. తెలంగాణ వస్తే కరెంటు కష్టాలు తప్పవని వెక్కిరించినవారు.. ఇప్పుడు కాంగ్రెస్ రూపంలో ఆ వెక్కిరింతలను, అక్కసును నెరవేర్చే కుతంత్రంలో ఉన్నరు. తెలంగాణపై పగ తీర్చుకోవాలని తహతహలాడుతున్నరు. కాబట్టే, వికారాబాద్ జిల్లా పరిగిలో కర్ణాటక కాంగ్రెస్ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించిండు– మా దగ్గర 5 గంటలు ఇస్తున్నం, ఇక్కడ కూడా అంతే అని. ప్రజాద్రోహంలో నాలుగాకులు ఎక్కువే చదివిన టీపీసీసీ అధ్యక్షుడు 5 కాదు, 3 గంటలే కరెంట్ ఇస్తం, తెలంగాణను చీకట్లలో ముంచుతం, చంద్రబాబు శిబిరంలో వెలుగులు నింపుతమంటూ యమ ఆరాటపడుతున్నడు. బంగాళాఖాతంలో ధరణిని కలిపి వెనకటి పెత్తందారీ పాలనకు తలుపులు బార్లా తీయాలని చూస్తున్నడు.

మిత్రులారా! మీరు ఒక్కపారి సోషల్ మీడియాను పరికిస్తే తెలుస్తది– ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎందరో టీడీపీ కార్యకర్తలు తెలంగాణలో రేవంత్‌రెడ్డి గెలవాలని కోరుకుంటున్నరు. చిత్రమేమంటే... రాష్ట్రం విడగొట్టిందనే భావనలో కాంగ్రెస్ పార్టీని తమ రాష్ట్రంలో బొందపెట్టించి, 2019లో గెలిచిన టీడీపీ ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ గెలవాలనుకుంటున్నది. అగ్రరాజ్యం అమెరికా లాటిన్ అమెరికన్ దేశాల్లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాలను నెలకొల్పి సహజ వాయువును కొల్లగొట్టినట్టు, చంద్రబాబు తెలంగాణలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనుకుంటున్నరు. పాత పగతో మరింత దోపిడీకి తెరతీయబోతున్నరు. రాజకీయ పరిణతి, తెలంగాణ ఆత్మ లేని కాంగ్రెస్ రాష్ట్ర, దేశ నాయకులు చంద్రబాబుకు ఊడిగం చేస్తున్న రేవంత్‌రెడ్డిని కట్టడి చేయలేకపోతున్నరు. ఆ పార్టీలో ఉన్న బడుగు, బలహీన వర్గాల నాయకులను హీనంగా చూసే రేవంత్‌రెడ్డి ఫ్యూడల్, కమ్యూనల్, చీప్, వల్గర్ ట్రిక్స్‌తో దిక్కుతోచని స్థితిలో పడిపోయినయి రాష్ట్రవ్యాప్త కాంగ్రెస్ శ్రేణులు.

పైన ఎల్మకన్నె గ్రామ ఉదాహరణలో చెప్పినట్టు పదేండ్ల కేసీఆర్ పాలన చవిచూసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైతం బీఆర్ఎస్‌ను వ్యతిరేకించడానికి సరైన కారణాలు చెప్పలేకపోతున్నరు. తమ తమ గ్రామాల్లో న్యూట్రల్‌గా ఉన్న ప్రజలను కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఒప్పించలేకపోతున్నరు. '24 గంటలు వద్దు–5 గంటలు ముద్దు' అనగలరా, '3 వేలు వద్దు, 8 వందల పింఛన్ ముద్దు' అనగలరా, '400 వద్దు 500 సిలిండర్ ముద్దు' అనగలరా... 'దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి తీసేస్తాం' అని చెప్పగలరా, ఇంకా గొప్పగా చేస్తమని చెప్పగలరా.. అని సామాన్య జనం నిలదీస్తున్నరు కాంగ్రెస్ ప్రచారకులను. పదేండ్లు అధికారానికి దూరంగా ఉండి బకాసుర ఆకలితో తహతహలాడుతున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గిస్తే ఆరంటే ఆరు నెలల్లోనే తెలంగాణను సాంతం నాకేస్తది!

కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభలు' 73 జరిగినయి సూర్యాపేటతో. తాండూరు సభ 74వది. ఆ సభల విజయాన్ని గమనించిన ఒక వెబ్‌పోర్టల్ ఇట్లా రాసింది.. 'తెలంగాణ ఉద్యమం ఉధృతాలూగుతున్న సమయంలో ఎలా అయితే.. ప్రతి పల్లె కదిలి వచ్చిందో.. అంతకుమించిన చైతన్యంతో సీఎం కేసీఆర్ ప్రసంగాలు వినడానికి ఊర్లకు ఊర్లే తరలివస్తున్నాయి. నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రజా ఆశీర్వాద సభలకు ప్రజలు లక్షలాదిగా తరలి వస్తున్నారు. సీఎం కేసీఆర్ మాటతప్పడు, మడమతిప్పడు అనే అచంచల విశ్వాసమే ప్రజలు పెద్ద ఎత్తున సభలకు వచ్చేలా చేస్తుందని శ్రేణులు చెప్తున్నాయి. ఇచ్చిన మాట కోసం సీఎం కేసీఆర్ ప్రాణం పోయినా వెనుకాడరనే నమ్మకం ప్రజలకు ఉందని చెప్తున్నారు. ఈ నమ్మకం, విశ్వాసం ఒక్కరోజుతో కేసీఆర్ మీద ఏర్పడింది కాదని.. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పిడికెడు మందితో తెలంగాణ ఉద్యమం ప్రారంభించినప్పటి నుంచే తెలంగాణ జనం కేసీఆర్‌పై విశ్వాసంతో వెంట నడిచిందని, ఇప్పటి వరకు నడుస్తున్నదని చెప్తున్నారు.'

అదీ సంగతి మిత్రులారా. ఆ దార్శనిక మహా నాయకుడు కేసీఆర్ ఎక్కడ, కాంగ్రెస్ పార్టీ ఎక్కడ! పూటకో కీచులాటతో పుణ్యకాలం గడిపేసే కాంగ్రెస్ అరాచక పాలన వస్తే... ఆడపిల్లల పెండ్లికి మొహం చాటేసే మేనమామ లెక్క కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సాయం అందనివ్వరు, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు ఉండవు, పుట్టిన బిడ్డకు కిట్ అందదు, బడికెళ్లే కాలంలో రుచికరమైన శ్రేష్ఠమైన అల్పాహారం అందదు. ఒక్క మాటలో చెప్పాలంటే 2014కు పూర్వపు పరిస్థితులు వస్తయి. తెలంగాణ ఉనికికి రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా కూడా ముప్పు తప్పదు. మనను బాధించే, అతలాకుతలం చేసే విషయాల గురించి తీవ్రంగా, స్పష్టంగా రాయాలని అంటరు ఎర్నెస్ట్ హెమింగ్వే. అందుకే ఇవన్నీ రాస్తున్న.

భేషజాలు లేకుండా; మోహమూ, మొహమాటమూ లేకుండా నేనిప్పుడు కొన్ని విషయాలు స్పష్టం చేయాలనుకుంటున్న. రెండున్నర ఏండ్ల కిందట వరకూ తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీలో పనిచేసిన నేను. పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యునిగా, ప్రొఫెసర్ జయశంకర్ మానవ వనరుల విభాగం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన. 2018 ఎన్నికల సమయంలో మహాకూటమి విఫలమైన తర్వాత... అందులో చక్రం తిప్పిన చంద్రబాబు కారణంగా టీజేఎస్ భిక్షుక పాత్రకు పరిమితమైన తర్వాత... అప్పటికి ఐదేండ్ల కేసీఆర్ పాలనను 2014కు ముందున్న రోజులను బేరీజు వేసుకున్న తర్వాత... ప్రగతి ప్రస్థానంలో పాత్రను వెతుక్కుంటూ అప్పటి టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణతో కలిసి కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న.

> నాడు టీఆర్ఎస్‌కు దూరమైన ఎందరో ఉద్యమకారులు అచ్చు నాలాంటి మథనంతోనే ఇపుడు బీఆర్ఎస్‌లో చేరిన్రు, ఇంకా చేరుతున్నరు. అదే చంద్రబాబు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని నడిపిస్తుండటం, తెలంగాణ ప్రేమికులను అందరినీ పొమ్మనలేక పొగ పెట్టించడం వల్ల దాసోజు శ్రవణ్, చెరుకు సుధాకర్, దరువు ఎల్లన్న లాంటివాళ్లు తిరిగి ఉద్యమగూటికి చేరుకున్నరు. ఇతర పార్టీల నుంచి కూడా ఉద్యమ బిడ్డలు అమ్మ ఒడికి చేరుకున్నరు. బేషరతుగా, మనస్ఫూర్తిగా బీఆర్ఎస్ విజయానికి కృషిచేస్తున్నరు. ఎందుకంటే పుట్టిన నాటినుంచి టీఆర్ఎస్ పార్టీ నడక తెలుసు గనుక; నాయకుడి కఠోర దీక్ష తెలుసు గనుక; దండలో దారంలా పార్టీని నడిపే ఫిలాసఫీ తెలుసు గనుక! ప్రగతి తీరాల సాగుతున్న తెలంగాణ నావను ముంచే శక్తులను ఎదిరించాలని నిర్ణయించుకున్నరు గనుక!

నా ఈ వ్యాసం బీఆరెసేతరులు కూడా చదువుతరని నాకు తెలుసు. కాబట్టే మనసు విప్పి పైమాటలు చెప్పిన. ఫిరాయింపులు వాటికవే తప్పేమీ కాదు. అయితే ఎందుకు ఫిరాయిస్తున్నం, ఫిరాయించి ఏమి సాధిస్తున్నం అనేది ముఖ్యం. వ్యక్తిగత ప్రయోజనాలు, సామాజిక ప్రయోజనాలలో ఏది పైచేయిగా ఉన్నదనేది కీలకం. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలు హక్కుగా అనుభవిస్తున్న బీఆరెసేతర ఓటర్లకు కూడా సవినయ విజ్ఞప్తి. నిర్మల హృదయంతో అద్దం ముందు నిలబడి మీ కండ్లలోకి సూటిగా చూస్తూ ఆలోచించండి. ఎవరి వల్ల ఈ రోజు మనం ఆనందంగా ఉన్నం; ఇంకా నెరవేరని ఆకాంక్షలను, ప్రయోజనాలను ఎవరు తీర్చగలరు; అలాంటి ట్రాక్ రికార్డ్ ఎవరికి ఉన్నది; ఎందుకు నాడు టీఆర్ఎస్‌ను వీడిన నికార్సయిన తెలంగాణ ఉద్యమ నాయకులు నేడు బీఆర్ఎస్‌కు తిరిగి ఒచ్చిన్రు; దాని వెనుకాల ఉన్న రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు ఏమిటి అనేది బేరీజు వేసుకోండి. ఇవి కేవలం నాయకులు గెలిచే ఎన్నికలు కాదు. ప్రజలు గెలిచే, తెలంగాణ నిలిచే ఎన్నికలు. ఊహ కథలు అల్లితే, వాస్తవం వాతలు పెడుతుందని సామెత. విజ్ఞులైన మీరందరూ తెలంగాణ ప్రగతి గణాంకాలను చూడండి. కాంగ్రెస్ చెప్తున్న మాయమాటలను గమనించండి.

> **మా తాండూరు భీమ్‌రెడ్డి చెప్పినట్టు..**
> **'హాత్ కో హాత్ దో, కార్ కో వోట్ దో'!**

ఈ నెల 30న మనసులో ఏమీ పెట్టుకోకుండా మీ సామాజిక, రాష్ట్ర ప్రయోజనాలకు మీ ఓటు వేసుకోండి. మీ సకుటుంబ సపరివార బంధు మిత్రుల ఓట్లు కూడా వేయించండి. ఆ ప్రయోజనాల ప్రతినిధి పేరు 'కారు గుర్తు'! మీకందరికీ ఇష్ట కామ్యార్థ ఫలసిద్ధిరస్తు..! జై తెలంగాణ!

# మైనారిటీలకు కేసీఆర్ నాయకత్వమే రక్ష

తెలంగాణలో ముస్లిం జనాభా దాదాపు 12.5 శాతంగా ఉన్నది. హైదరాబాద్‌లో ప్రత్యేకించి పాతబస్తీలో ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న ముస్లింలు పలు అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారు. సాధారణంగా ముస్లింలు మొదటినుంచి తెలంగాణ రాష్ట్ర వాదనకు అనుకూలురు. ఇదే రీతిలో తెలంగాణ ఏర్పడిన నాటినుంచి కేసీఆర్ వెంటే నడుస్తున్నారు. పాతబస్తీ ప్రాంతం మజ్లిస్ పార్టీకి కంచుకోట అనేది తెలిసిందే. మజ్లిస్‌తో హోరాహోరీ తలపడిన చరిత్ర టీఆర్ఎస్‌ది. పలు స్థానాల్లో మజ్లిస్ తర్వాత ఎక్కువ ఓట్లు టీఆర్ఎస్‌కే రావడం గమనార్హం. ఇక తెలంగాణ వ్యాప్తంగా మైనారిటీ ఓటర్లు మొదటినుంచి టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్)వైపే ఉన్నారు.



**జావేద్**



ఈ మధ్యకాలంలో ముస్లింలు కాంగ్రెస్ వైపు మొగ్గారనే తప్పుడు ప్రచారం సాగుతున్నది. ఈ ప్రచారానికి ఎటువంటి ఆధారాల్లేవు. కానీ, ప్రచారాన్ని కొన్ని శక్తులు కావాలని సాగిస్తున్నాయి. బీజేపీని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ చేతకానితనాన్ని దేశవ్యాప్తంగా ముస్లింలు గమనిస్తున్నారు. జాతీయ స్థాయిలో చూస్తే బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య పోరాటం సాగుతున్నట్టు కనిపిస్తున్నది. కానీ, వాస్తవానికి బీజేపీని ఢీకొనే స్థాయిలో కాంగ్రెస్ లేదు. పశ్చిమబెంగాల్, తెలంగాణ తదితర అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలే బీజేపీకి అడ్డుకట్ట వేస్తున్నాయి. మత విద్వేషాలు లేకుండా సామరస్య పాలన ప్రాంతీయ పార్టీలు ఉంటేనే సాధ్యపడుతుందనే అవగాహన ముస్లింలకు ఉన్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ మొదలైన రాష్ట్రాలలో బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్య పోటీ ఉన్నది. ఈ రాష్ట్రాలలో మత విద్వేషాలను ఈసడించుకునే లౌకికశక్తులు కాంగ్రెస్ బలంగా ఉండాలని కోరుకుంటున్న మాట నిజం. కానీ, ఈ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ బీజేపీని గట్టిగా ఎదిరించడం లేదు. ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ కూడా మోదీకి ధీటుగా వ్యవహరించడం లేదు. గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేకత కొద్దీ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించినా, ఆ విజయాలను స్థిరపరచుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం విఫలమవుతున్నది. బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని పక్షాలను కూడగట్టడంలో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం విఫలమైంది. అందువల్ల కాంగ్రెస్ పార్టీ ముస్లింల, లౌకికవాదుల మద్దతును కూడగట్టుకోలేకపోతున్నది. ఈ నేపథ్యంలో ముస్లింలు కాంగ్రెస్ వైపు మొగ్గడమనేది జరిగే పనికాదు. అది నమ్మశక్యమైన వాదన కాదు.

కర్ణాటక ఎన్నికలలో ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన మాట నిజం. అక్కడ బీజేపీ అవినీతి, విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా పార్టీలకతీతంగా అన్ని శక్తులూ ఏకమయ్యాయి. దీంతో కాంగ్రెస్ విజయం సాధ్యమైంది. ఇందులో కాంగ్రెస్ పార్టీ కన్నా, స్థానిక నాయకుల శ్రమ ఎక్కువగా ఉన్నది. కానీ, తెలంగాణలో పరిస్థితి వేరు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నాయకుల విధానాలను ప్రజలు మొదటినుంచి వ్యతిరేకిస్తున్నారు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజల పక్షాన నిలబడి పోరాడలేదు. తెలంగాణ ఇవ్వడంలో కాంగ్రెస్ ఆలస్యం చేయడం వల్ల అనేకమంది యువకులు బలిదానాలు చేసుకున్నారు. దీనంతటికి బాధ్యత కాంగ్రెస్‌దే. తెలంగాణను ఆంధ్రాలో కలిపింది, ఇంతకాలం ప్రజల మనోభావాలను దెబ్బతీసింది కాంగ్రెస్ పార్టీయే. అందువల్ల హిందువులు కావచ్చు, ముస్లింలు కావచ్చు, ఎవరైనా సరే, మతాలకతీతంగా కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం మత కలహాలు సృష్టించిన చరిత్ర కూడా కాంగ్రెస్ పార్టీదే.

> ముస్లింలు బీఆర్ఎస్‌కు ఓటు వేయరనడానికి ఒక్క కారణం కూడా చూపలేం. కానీ, బీఆర్ఎస్‌కే ఓటు వేస్తారనడానికి అనేక కారణాలు చూపవచ్చు. ఇందులో మొదటిది– భద్రత. కేసీఆర్ పాలనలో ముస్లింలు భద్రంగా ఉన్నారు. కేసీఆర్ మత విద్వేషాలకు తావులేని విధంగా పాలిస్తున్నారు. రెండవది సంక్షేమ పథకాలు. కేసీఆర్ పేద జన బాంధవుడు. మతాలు వేరైనా పేదలంతా ఒక్కటే. అందరూ కోరుకునేది సంక్షేమమే.

ఇంటింటికీ మంచినీరు, సాగునీరుతో పాటు అన్ని పథకాల వల్ల మతాలకతీతంగా అందరూ లబ్ధి పొందుతున్నారు. కల్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ వంటి పథకాలు పేదలను ఆదుకుంటున్నాయి. ముస్లింలలో ఎంతో ఊరట కలిగిస్తున్నాయి. అన్ని బలహీన వర్గాల మాదిరిగానే, ముస్లింలకు కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాలను ఏర్పాటుచేయడం గొప్ప విషయం.

మైనారిటీల కోసం ఏర్పాటుచేసిన 204 గురుకులాల్లో లక్షలాది మంది బాలబాలికలు కార్పొరేట్ స్కూళ్లలో లభించే నాణ్యమైన విద్యను పొందుతున్నారు. ఇది దీర్ఘకాలికంగా ముస్లిం సమాజంలో విప్లవాత్మక మార్పునకు దారితీస్తుంది. బీసీ బంధులో భాగంగా కూడా ముస్లిం పేదలు లబ్ధి పొందుతున్నారు. అందుకే ముస్లింలు కేసీఆర్ పట్ల గౌరవం, అభిమానం చూపుతున్నారు. ఇటువంటి మహా నాయకుడు మనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నారు.

> రాష్ట్ర ప్రయోజనాల విషయానికి వస్తే మతాలకతీతంగా అందరం ఒక్కతాటిపై నిలబడాల్సిందే. ఈ కోణంలో చూస్తే తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడేది ఒక్క కేసీఆర్ మాత్రమే. మన రాష్ట్ర వాటా నీళ్లు కావాలన్నా, ప్రాజెక్టులు కట్టాలన్నా, కేంద్రాన్ని ఎదిరించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలన్నా అది కేసీఆర్‌కే సాధ్యం. అందువల్ల మతాలకతీతంగా అన్నివర్గాల ప్రజలు కేసీఆర్‌కు అండగా నిలబడాలి.

తెలంగాణ సంస్కృతి గొప్పది. తెలంగాణలో గంగా జమున తెహజీబ్ ఉన్నదని మహాత్మాగాంధీ ప్రశంసించారు. మొదటినుంచి భిన్నవర్గాల ప్రజల మధ్య సౌహార్ద సంబంధాలున్నాయి. ఈ ఐక్యత తెలంగాణకు అవసరం. అందువల్ల ముస్లింలు, అన్ని మతాల ప్రజలు కేసీఆర్‌కు అండగా నిలబడాలి. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ తప్ప మరొకరు కృషిచేయలేరని గ్రహించాలి.

> **ముస్లింలు బీఆర్ఎస్ వైపే ఉన్నారు తప్ప మరే పార్టీ వైపు మొగ్గడం లేదు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటారు. గోల్కొండ కోటపై మళ్లీ కేసీఆర్ జెండా ఎగురవేస్తారు.**

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)